# ఒక బహుముఖం

కాశీభట్ల వేణుగోపాల్



# ఒక బహుముఖం

కాశీభట్ల వేణుగోపాల్

**OKA BAHUMUKHAM** *(Anthology of Poems)*
by KASIBHATLA VENUGOPAL

First Edition : October 2002
Second Edition : May 2013

© Author

*Inside Illustrations :*
**CHANDRA**

*Published by :*
**AKSHARAM PRACHURANALU**
87/1345-10, Nandyal Checkpost
Kurnool - 2
Cell : 95500 79473

*For Online Purchases & e Book*

Kinige www.kinige.com

*Printed at*
**Sri Sri Printers**
VIJAYAWADA - 520 002
Cell : 9490 634849

**Rs : 80**

మా బొడ్డోడు

రాజుగాడికి

ప్రేమతో

మామ

**హలో!**

నేనూ, నా లోపలి నేనులు ఛిన్నాభిన్నమైన క్షణాల్లో నాలో నా నేనుల్లో మొలిచిన ఆలోచన్లివి. దీన్ని కవిత్వం అనే ధైర్యం లేక, యిష్టంలేక Musings అన్నాను. వైయక్తికాలోచన్లని పబ్లిక్ చేయొచ్చా అన్న మీమాంస చాలారోజులుండింది. వయస్సు పైబడ్డ తర్వాత లోపలేమిటీ బయటేమిటీ లోపలా బయటా నేనేకదా... అని అనుకుని ఇదన్నమాట. జ్ఞానం మనిషిని కలుషితం చేసిన మరుక్షణం వాడు చితికిన పాదరస బిందువు...ఎన్నిసార్లు ఒక్కటిగా చేసినా వాణ్ణి వాడు జారువిడ్చుకుంటూ శతసహస్రాలుగా చిట్లిపోతూంటాడు... ఆ శకలాల వికటపాలోచన్లే ఇవి. ఓ అంతర్దుఃఖం... ఆనందావేదనా... నిస్సహాయత... ప్రేమా, క్రోధం, పొగరూ అన్ని ముఖాల నేనూ – ఈ చిన్ని పుస్తకం. నాకు నేను Censor విధించుకోలేదు. అందుకనే నగ్నంగా అసహ్యంగా ఉద్విగ్నంగా అక్కడక్కడా దర్శనమిస్తాను. ఇవి పదచిత్రాలో, చిత్రపదాలో తెలియదు. చంద్ర గీతకు నా రాతలో నా రాతకు చంద్ర గీతలో...!? దీనికి జీవం పోసిన రమణ మరణించి పునర్జన్మించి... పునరపి పునరపి అంటుంటాడు. వాళ్ళిద్దరికీ, రచన శాయిగారికీ థాంక్స్ చెబుతూ...

ఓ చిన్న మాట...

నాలుగక్షరాల వెల్లులి రేకల్తో ... ఇంకో రెండుక్షరాల ఉల్లిపాయల్తో ... ఉత్ప్రేక్షల ఉప్పుకారాలు నల్చుకుని కవిత్వాన్ని కలుపుకు తిందామని ఆకలి...వైశ్వానర ఉద్వేగం హోరున కాలిపోతుంది. చద్ది మంట చెలరేగదా... ఏదో నలుపుకుని కలుపుకున్నా... ఇంద మీకో పిడచ యెందుకనో కాదు యెలా వుందో కక్కమని... కక్కమనో కారమనో భారమనో హోరుమనో ఉస్సూరుమనో... ఎలాగోలా ప్లీజ్ ఎలాగున్నా సరే ఎలాగోలా ఇలాగేనని... నమలండి...

చద్దన్నప్పిడ్చు కరడుకట్టింది
అమ్మల్లే కాకున్నా నమ్మిన సాహితీ సహచరుడిగా
ప్రవాసంలోంచి ఆయాసంతో ప్రయాసతో...



# ఒక బహుముఖం

కొన్ని కోట్ల సమాధానాలు పేనిన ప్రశ్నారజ్జువుకు వేల్లాడ్తో ఆత్మ గిలగిల్లాడ్తోంటే

నా భుజమ్మీదకి జారి బద్దలైన ఆకాశాన్ని ఆశాశూన్యంగా విదిల్చి నే...

రెండు ఆరిపోయిన సాంధ్యచిత్రాల్ని కళ్ల నిండా మోస్తూ వాడు...

శూన్యం కొరకు ఉల్లిపొరలు వలిచే బుద్ధి సీతాకోకచిలుక్కి వచ్చి...వచ్చిన రెక్కలు రాలిపురుగై...

పట్టు దొరకని కందరాల పట్టుకోసం యాతనలో...

పుట్టుకకి పురాతన చైతన్యం... చేతల్లేని చేతుల్తో, కదలికల్లేని కాళ్ళతో ఓ

వాయురాపస్తేజోమూర్తిని కలివిడిగా కావలించుకునేందుకు... వాడూ నేనూ...నేనూ వాడూ...

వాడి పంటిసందుల్లో చిక్కుపడ్డ పొద్దుటి రెక్కలుపోయిన పౌల్ట్రీ ముక్కా

గ్లాసు బోర్లించిన సీసా చుక్క... వర్జీనియా పొగలు అమెరికా ఒంటె మార్కు అలలు...

పద్యం తాగి వాడు, ముఖచిత్రాల విప్పదీసుకునారేసుకున్న

పుస్తకాల చీకటిసందుల్లో అమూర్తమైన రూపాల అర్థాలు వెదుక్కుంటున్నాడు

అక్షరం అక్షరం సందులో అర్థం కాని శూన్యార్థం నాకు...

పద్యం కిక్కులో పదాలని రమించే ప్రయత్నం...

పుస్తకాల చీకటి సందుల్లోనే వాడు...

ఆకాశం నా భుజమ్మీద బద్దలైతే ఆశాశూన్యంగా విదిల్చి నే... నే...

క్యానబిస్ కలల్ని ఊపిరి ఉలిపిరికాయితమ్మీద ట్రేస్ ఎత్తి

ఎర్రటి గులాబీ గుండెల మీద అచ్చు వత్తి నకళ్లు తీస్తూ వాడు...

ఒక్క మోతాదు జీవితం కూడా తాగనివాడు

వితస్తితో విశ్వం కొలతల్తీస్తాడు...

అప్పుడు చప్పట్లుకొట్టి వాడి ఉలిపిరి కాయితం కల వెనక నించీ ఇంకో నకిలీ ముఖం మీద



సూపరింపోజై నేను... నీ వాస్తవ స్వప్నాలరాస్తాలో నడుస్తారా అంటే...

నీ భుజమ్మీది ఆకాశపు తునకలు నా దారుల్లో జారుస్తావంటాడు వాడు...

జానతో జగాన్ని కొలుస్తాడు మళ్లీ తలకిందులై

భ్రమాతరంగాల్లో కొట్టుకొస్తున్న ముఖాల్లోకి తన భాషను ఊది, ఆ మహాప్రవాహ భ్రమ విభ్రమే తానుగా  చిట్లిపోయిందంటాడు...

కానీ ఒడ్డున్నే గడ్డకట్టిన శిలాజముఖం వాడు మరొకడు...

ప్రవాహంలో అలుక్కుపోయిన ప్రతీ ముఖం తనదేనంటూ యింకో ముఖశూన్యుడు...

భుజమ్మీంచి జారి బద్దలైన ఆకాశాన్ని ఆశాశూన్యంగా

విదిల్చి... నే

నే... నే.



# ఆ చీకటి వీధి

మహాకావ్యం మధ్యలోంచీ పారిపోయొచ్చిన
పాత్రోటిచ్చట మాత్రము చేయరాదు
బహిరంగ రంగప్రవేశావేశ వేషాలు దొరకవు
టోకెన్లే...
టికట్ల యిక్కట్లిచ్చోట
షరా మామూలే స్త్రీలకు ప్రత్యేక స్థలం కలదూ...
లసత్ వృత్త గంభీరనాభీ లోతుల్లో క్రిందెక్కడో
ఓ రావి ఆకు చినిగి... ఛిద్రమై
మొదటి కిరణం మోసుకొచ్చిన వెచ్చదనం
రాత్రి కోసం ఘనీభవించడానికిక్కడ దుఃఖిస్తోంది...
ఆనందావేదన యెంత వేదనాభరితం!
పారిపోయొచ్చిన పాత్ర పారిపోయి కావ్యం మధ్యలోనే
తలదాచుకుంటోంది మళ్లీ...
నా వెనక నన్ను నేను దాచుకున్న నానుంచే కాపు కోసం...
యెంతాలస్యం...యెంత వేగిరం...
దుఃఖిస్తో ఘనీభవించి రాత్రినించీ వెచ్చదనం,
తనని మోసుకొచ్చిన కిరణాన్నెక్కి వలసెళ్లిపోయింది.



# నేనూ - ఒంటరి సూర్యుడు

కరిగిపోయి మరిగి మరిగి ఇగిరి ఆవిరైపోయే యీ జ్ఞాపకాలన్నీ...ఈ
శవాల తలల్లోంచీ బైటికి కారిపోతూ... తూ ... పాయఖానా
స్యాంక్టం స్యాంక్టోరం గార్గోయిల్ తూముల్లోంచీ...
కమ్మటి పరిమళ ఘనసారపు పెనుతుఫానుల్లో చిక్కుపడి...
ఉక్కిరిబిక్కిరైన... ఆలయగర్భాలు...
విచ్ఛిత్తి...
పగిలిన నారికేళం...
కాలవ్యాళం లా... ఓ నాభినాళం... వ్యాకోచించి
గర్భసంచీ చించీ...
కన్రెప్ప చివర వేలాడిన అశ్రుబిందువులో దూరి...
చిట్లి చితికిపోయిన సంధ్యలో దూకి ఆత్మహత్య చేసుకుని మరీ...
అస్సలు కదలికల్లేక... మృతభ్రూణమా? మృతశిశువా... మృతమృతా?
మృతజీవా? కదలకనే...
విశ్వాంతర గమనరేఖల్లో... క్షితిగతి గుండ్రంగా మారి
(e pur si Muo - va) ఏ పూర్సీ మ్యోవా
గలీలియో గలీలీ... లీలా యోగలీలా... పతంజలీ యోగలీల
వినీలాకాశపు కక్ష్యలో క్షితిజరేఖను చిత్రించి...
వాడి వెంబడి భూమి తిరుగునూ ఆర్యరక్షకభటా!
సమస్త విశ్వానల జ్వాల ఏ కక్ష్యలో...
బూడిద చుక్కై... బొట్టు బిళ్ళతికించినట్లు
వాడు సూరిగాడొంటరై తన చుట్టూ తారకలల్లే గోళాలన్నింపుకుని
ఇదివరకల్లే గాక... గిరగిరాం భ్రమణం... హల్లీసకమాడుతూ...
భ్రస్టారిస్టాటిల్ స్టోరీస్మోత్రం... తప్పున్చేస్తూ
ఒక్కడే ఒకానొక్కడే అనంత విశ్వంలో పాపం వాడే; వాడలాగే
ఒక్కడే...
చిరిగిపోయిన చరిత్రలు కప్పుకున్న నాకు మల్లే జ్వలిస్తో ఒంటరి సూర్యుడు...



# ఆ సంధ్య - వాడు చదవని కవిత

1

ఆ సాయంత్రపు కథ శ్లథం కాదు...
ఆ నాలుగ్గోడలూ ప్రపంచం వేపు తిరిగి యావత్ప్రపంచాన్నీ
కౌగిలిస్తాయి... హస్తాలులేని మొండేలతో...
మన బైట మొలిచిన హస్తాల్తో
గుప్పిళ్ల నిండిన వసంతాలను గదినిండా చల్లి
నూర్పిళ్లు లేని పంటేస్తాం...
ఎవరెవరివో చినిగి చిత్తైపోయిన ఆలోచనల్ని తెచ్చి
నిర్దాక్షిణ్యంగా వోదార్పుల్లేని మంటేస్తాం...
మత్తు విత్తనం మొలకెత్తిన మరుక్షణం మహావృక్షమై
కొమ్మల మీదా రెమ్మల మీదా ... పక్షాలు అలసిన అక్షరాల
పక్షులమౌతాం మనమే...
మనమంతా ఒకే మనస్సౌతాం
గొంతు చిట్లిన గాంధర్వమౌతాం...!
మళ్లీ విప్పి చూసుకుంటానా సాయంత్రపు మంత్రాక్షతల పొట్లాన్ని...
ఆ మడతల్లో అస్తమిస్తున్న సూర్యరేఖా రక్తిమని...

2

ఎంత పవిత్రత! పాడుబడని ఆ సంధ్యల్లో
స్మరణ యెంత వేదన?
మెలి తిరిగిన జ్ఞాపకాలు మనసుకుత్తుకకురి
అరే! తిరిగీ స్ఫురణ... ఓ మత్తు ఛురి
నొప్పి తెలీకుండా కండకండా కోసుకుందాం...
మనకే మనం ఓ 'అటాప్సీ' చేసుకుందాం...
కాలిపోయి గాయాలైన చిహ్నాలు ఆ గది మూలల్లో
పీలికలై చీలికలై



ఆ విషాదానందపు అనుభూతికి అనువాదం లేదు
తెగి రాలిపడిన సీసాల మూతుల్లోంచీ నిశ్శబ్దం
నిరామయంగా ప్రవహిస్తూనే వుంటుంది
నుసిగా మారి... పొగలైతేలి... వాడొక్కడూ చదవని
కవిత కర్పూరమౌతుంది
భాష పరమార్థమింత వరకూ తేలలేదు మిత్రుడా!
ఆ రంగుల హంగుల్ని యే కుంచెలూ అనువదించలేదింతవరకూ నిండుగా...

3

'ఓకీఫ్' పుర్రెలూ ఎడారులూ...పువ్వులూ
'నాలుగ్గంటల పువ్వు' 'నగుమోమూ గనలేని'
'భీంభేరిలాస్' రాగం వియోగమై వద్దులే...
దేనికీ హద్దులే...
ఆ బేహద్ నిశ్శబ్ద శబ్ద ప్రపంచాన్ని నేను దోసిళ్లకొద్దీ
తాగేశానంటారా?
అవున్నిజమే చినిగి పీలికలైన బతుకు ఒక అనామక
ఆనందంలో పడి తడిసిపోతే... తీసి విదిల్చి
పిండేసారీ సాంఘికులు పిండారీలు...
బొట్టు బొట్టూ అదే... చింకిపాత బతుకుదే అదే
అనామతు ఆనందం...
అరే ఏ లెఖ్ఖలోకీ రాదు
నేనెంతానందించినా యేమాత్రం ఖర్చు లేదు
యెంత విచిత్రం!
నేనెంత శోకించినా...కించిత్గాయం కలుగదు
ఇదేం రోగం? ఇదేం దేహం...

4

ఆ సాయంత్రం
వాడొక్కడూ చదవని కవితా
రంగులూ... రాగాలూ
వెచ్చని కర్పూరపుటావిర్లు.



# నేను దాంతే కాను

నా వెంట వ్యాసుడూ వర్జిలూ బాణుడు యెవ్వడూ రాడు... నా కలల
అడవులగుండా నా ప్రయాణంలో ముళ్ల పువ్వున్చూసేవాడూ... పువ్వుల్ని
ముళ్లల్లాగా గుచ్చుకునేసుకు దిగేసుకున్న వాడూ వస్తాడు...
ఓ కలల సంహారి... కలలడవిలోకి నాతో కలిసొస్తే యెలా?
ఇక్కడ దారుల్లో చీకటి చిత్తడిలోంచే కిరణాలు మొలుచుకొస్తొన్నాయి
వెలుగుల బురదల్లో చీకటితీగలు పాకుతున్నయ్...
దారుల్లేని ఆ కకావికల కలలడివిలో ... నిజపాద స్పృహకోల్పోయి
మేమిద్దరం... నేనూ... ముళ్ల పువ్వున్చూసేవాడూ జ్ఞాపకాలనెక్కి
నలుదెసలా ఓకేసారి కదులుతాం... క్రింద కలల అలల కలివిడి
అడవిలోకి మా శరీరఖండాలను ఒక్కోటిగా జార్చుకుంటూ...
ఆఖరికి మేమిద్దరం మా శరీరాలను జార్చేసుకున్న తర్వాత
మా జ్ఞాపకాల మీద ఓ వెల్తురు చుక్కా...ముళ్లపూవు మిగుల్తాయి...
వ్యాసుడూ వర్జిలూ బాణుడు... ఒక్కోడూ
దాంతే క్రీస్తూ... మంచుమంట దాసూ... సుబ్బారావూ యేదో మిగిలిందిలే
అని... యేమో అంటూ చివరికాష్ఠం పెట్టి చింతలవాడు...
అందరూ... సోక్రటీసూ... రామసేసూ... కళింగరాజూ టూటాంఖమూనూ
అందరూ... మా శరీర ఖండాలను యేరుకుని ఆ కలివిడి కలల అలల్లోకి
వెళ్ళిపోతారు...
అప్పుడు మేం ప్రయాణిస్తున్న జ్ఞాపకాల మీద
ఓ వెల్తుర్చుక్కా... ముళ్ళ పువ్వూ మిగుల్తాయి...



# లేట్మ్యాన్సూన్

కావాలంటే యీ సంవత్సరాన్నల్లాగ పక్కకి పెడదాం...
మన్దేం పోయిందీ...?
మబ్బుల కమిటీ అలీసమైందంతే
నీకూ నాకూ బాధేం మనిషీ... కాలకూటం స్ప్రే చేసుకుని కత్తుల
చొక్కా... యెత్తారుసుకునే జరీమెరుగూ పరుగూ
విత్తనాన్నడుగుదాం...
కుత్తుక చించుకు హరిత గీతం అరిచేదదే గదా?
లేట్మాన్సూననింగ్లిష్లో మనం విషాద గీతికలాలిపించాల్సినవ్వరం లేదు...
వర్షం... హర్షాతిరేకకేతనాలెగరేస్తూ వస్తోంది...
ఆలీసమైతేనేం... కొన్ని యుగాలు; ఎలా కొంపలేం మునగవ్
మట్టి పొరలు మరుల్గొన్నాయి... వస్తాయి మేఘసందేశాలు
నల్లరేగడి చీకట్లో చినుకు శోభనం...
విత్తుకు గర్భాదానం... నోరుతెరిచిన విత్తనం
మొత్తంగా యేదో ప్రవాహాన్నే పీల్చేస్తోంది... మనిషీ




# నాకునేనై

నేనెవ్వరికీ భయపణ్ణు
కాంతిదాహం నాది...
నాకు సిగ్గు లేదు
అరణ్య మలినాల్ని పులుముకున్నవాణ్ణి
నా పేరేమనడిగితే...
అక్షరాన్ని చూపించేవాడిని...
క్షరమై పొమ్మని శపించే వాళ్లు నన్నెగతాళి చేసినా సరే...
నా ముంగిట్లో ఓ మబ్బు దిగి... ఓరోరే! నే కురిసే ఓపిక లేకనే నేరుగ్గా వచ్చేశారా... అంటే... దాన్ని
నా ప్రాంగణంలో కురిసిపోతీరవల్సిందే అనే దురహంకారం నాలో లేదు
అమబ్బున్నే పొదుక్కుంటూ... అదుంకుంటా వెచ్చగా గుండెకంటా...!
ఆ నెత్తుటుచుక్క మీ ఉదయపు లలాటాన
కుంకమ రక్తిమైతేనే తంటా... ఉంటా సెలవ్!



# ఆరి వెలిగిన వాడే...వాడే!

ఆ చివ్వరి క్షణం వరకూ
ఎవ్వరికీ తెలీదు
ఈ నిప్పుపుల్ల కొస భాస్వర స్వరం
విషాదాన్ని విసురుగా గీచుకొన్న మరుక్షణం
మహోధృతంగా మండి కాంతిని పిండి పోగల్దని
రాగాలనంతమై దిగంతాలకు ప్రవహించి నశించిపోతాయనీ
కరచాలనంలో తీక్షణ
వైశ్వానర సంచనలనముంటుందనీ.
నిజమే యీ ద్రాక్షాసవ పృషతం
రక్షక రాక్షస ఉదంత రాద్ధాంత గ్రంథాల ఉత్ప్రేక్షల చిట్లిపోతుందనీనూ...
ఇక్కడ ఎత్తిన పిడికిళ్లు
నీళ్ల గ్లాసుల్లోకి దూకి ఆత్మహత్య చేసుకోగలవు
కుర్చీ కాలికి వేలాడుతూ ఉరిపెట్టుకోగలవు...
పసితనపు చారికలు పోని ఓ చిగురు మీద
పైశాచిక నృత్యం జరగగలదు...
ఈ అపహాస్య మృతుల మధ్య మండే చితిలోంచి...
ఆరిపోయినవాడే మళ్లీ వెలుగుతూ...రానూగలడు



# ఒంటరిగా నడుస్తూ

కాలరేఖారక్తిమ నా పాదాలకి... నేనడిచొచ్చిన ముద్రలంతా ఎర్ర సముద్రాలైనై
రక్త తమస్సులో తడిసొచ్చిన మనస్సు
పిండుకుని పిండుకుని ఎండారేసుకుంటోంది తనన్తాను
గుండెకీ గుండెకీ కట్టిన దండెమ్మీద...
చెట్లు రెండు వొరసల్లో నుంచోని
ప్రవహిస్తోన్న రాస్తాన్ని తాగేస్తున్నాయి వేళ్లతో పీల్చిపీల్చి...
ప్లాస్టిక్సంగీతమెలాస్టిసిటీ కోల్పోయింది...
లాగొదిలేస్తే అలాగే సాగూరుకుంది
హాహా ఈ మహా ప్రవాహం ఘనీభవించక
ప్రవహిస్తూనే వుందందులో మాత్రం ఘనీభవించిందే
అదొక్కటి మాత్రం విస్ఫోటించకదీ ప్రవహించేస్తోంది
రండి రండి కొట్టుకుపోదామందరం కలిసే విడివిడిగా...
అద్దం వెనక రంగుగీకి ఎవ్వరో చేసిన వికృత గాయంగా
చంద్రబిలం ఆకాశంలో
ఇక్కడి కిందనెక్కడో లోతుల్లో నేను ఎర్ర సముద్రాల ముద్రల్నేస్తూ
నడుస్తూ పోతున్నాను...



# తిరగబడనివి

Bugles Blown
Trumpets torn
Drums beaten to death

వాద్యాలు తిరగబడవేం? ఖాద్యాలు కక్కబడవేం... విద్యలు వినాశనం అయిపోవేం?

కాస్మిక్ డాన్స్ 'కావ్రా' 'తోవ'లో విధ్వంసం లయబద్ధం విలుబద్దైవంగిన శరీరంలోంచీ కాంతి కామనలు

శరాలై దూసుకొస్తున్నె
ఫల్గుణ పార్థవ... ఇంకెక్కడి పార్థివత్వం... మట్టి విశ్వరజస్సులో
కల్సిపోయింది... కాంతి రేణువులైరాలిపోయింది...
వాడి మేధకు పక్షవాతం రాలేదెందుకనీ... తల్లోంచీ కన్పించని
Antennae తో కాస్మోస్‌ని పీల్చేస్తోన్నా డేమో?!
ఆ చక్రాల కుర్చీ... మార్చురీ... వాడో బతికిన శవం
ఆలోచన కడ్డీగ్గుచ్చబడి వాడి శరీరం సీఖ్‌కబాబ్
వాడిదంతా కాస్మిక్ పరిమళమే...
పీలిస్తే కమ్మగా మన్నోట్లో విశ్వాంతరాళం ఊరుకుంది.

(Stephen Hawking కోసం)



# కవికథకుని కన్ఫెషన్ దస్తావేజు

స్థలం – క్షితిజ రేఖ.
తేదీ – అనాది...

వ్రాయించుకున్నవారు – ఓ మృతి

వ్రాయించి ఇచ్చినవారు – మూడు ఆశలు

సదరు దస్తూరీ స్వదస్తూరీయే... కస్తూరి పరిమళం 'మా' అనబడే నా అక్షరాల్లో మూడు ఆశల్లో ఒక ఆశనైన నేను యవన్మందికీ, యావదక్షరాలకు, యావద్హృదయాలకు, యావదంతర్నేత్రాలకూ, యావక్షేత్రాలకూ... యావత్తిమిరానికీ, యావద్భాతికీ, యావద్ధ్వానికీ, యావత్ఛేదానికీ... తద్వారా యావద్విశ్వానికీ తెలియపర్చడమేమనగా... మా ఆశలకు (మా మూడు ఆశలకు మాత్రమేనని తెలియగలరు) చెందిన పురాతన క్షిప్త మంజూషను... (నాలుగో ఆశ అని పిలవబడ్డ ఓ మృదాశకిందులో యోలాంటి హక్కు లేదనిన్నూ... సదరు 'నాలుగో ఆశ' అన్న అసలు సిసలు నిరశామృతి రాయించుకున్న పత్రమిది కాబట్టిన్నూ... దఖలు చేసుకున్న మరణ ధ్రువీకరణ పత్రాల్తో అనువర్తిస్తూ) తెరువబోతున్నామని యిందుమూలముగా ఘోషించడమైనది...

**అనాదినించీ...**

మా ఘోషణ విని 'నాలుగో ఆశ' అన్చెప్పుకునే మృదాశ మా పురాతన మంజూష మీద హక్కును కోరుకునే లోపల... మేము (సదరు మూడాశలు) ఈ ధ్రువీకరణ దస్తావేజును రిలీజు చేయుచున్నామని... (ఈ నిజాన్ని మృదాశకు భ్రాంతిగా మంజూరు చేయించుటకున్నూ...) 'నాలుగో ఆశ' అనబడు మృదాశ మరణ సాక్షులుగా... నిస్పృహ, నిస్తేజం, నిర్వీర్యం... సంసారం, అన్నలూ, వదినెలూ, అక్కలూ, బావలూ, మేనకోడండ్ల మేనరికాలూ వావివరసలు తప్పిన కామాతురతలూ... తల్లుల్ని దిగంబరంగా చూచే ముసలి తండ్రుల మంటి (అనగా మన్ను... మృత్తిక, Mud మిట్టీ అని అర్థాలు కల) కప్పులూ... అసంపూర్ణ జీవిత భ్రాతలూ... వాళ్ళ చిగురించని కోర్కెలూ... అయిన వీళ్లందర్నీ హాజరీ పర్చడమైనది... ఆరోజున ఈ సదరు సాక్షులు విచ్చేసిన చావుకూటికి (అనగా మా 'నాలుగో ఆశ' అనే మృదాశ మృతికి) సాక్షులే సాక్షులు...

**మళ్లీ అనాదినుంచీ...**

సాక్షులుగా వున్న ఆ చావుకూటికొచ్చిన సాక్షులు పాల్గొన్న Funeral feast లో అద్భుతాలు కానివి మనిషి చర్మాల్లో నింపి పెట్టి కుక్కి కుట్టిన అనుబంధాల్ని వండుకు తిన్నాం... చెండుకు తిన్నాం... కండరాల మధ్యా... నరాల మధ్యా... నాగరికతల్ని నలుపుకు



తిన్నాం... సలుపుకు తిన్నాం.. స్త్రీపుంనపుంసక లింగ భేదాల్ని చర్మాలొలుచుకుని తినేశాం... తిన్నాం తిన్నాం తిన్నాం... యేవో విముక్త రక్తాల్ని దోసిళ్ల కొద్దీ తాగాం తాగాం... తాగి తిన్నాం... తిని తాగాం... (యిది యంతయూ 'నాలుగో ఆశ' అనబడు 'మృదాశ' 'చావుకూడు' అను పండుగ తిండిలోనే అని గమనించగ(లు) అప్పుడు మేమంతయూ మేమందరం... అందరి మేమూ అంత మేమూ మేమంతయూ (సదరు నిరాశా నిస్పృహ నిర్వీ... తదితరులు తప్పతాగి రాగాల్లోంచీ రేగిన గాయాల్లోంచీ కారిన విముక్త రక్తాల్తాగియుండగా...

మూడాశలమైనమేము మా పురాతన మంజూషను తెరిచా... మూ (అనిన్నూ)

**మళ్ళీ మళ్ళీ అనాదినుంచే...**


అందుండిన పురాతన పరిమళాలూ... దుర్గంధాలూ... ఉరితాళ్లూ మొగిలిరేకులూ... పచ్చడాలూ... పచ్చకర్పూరాలూ...ద్రాక్షసవం విమోక్షాధ్రువం... ఆకాశాలూ... అనంతాలూ... అనల్పాలూ... నీచాలూ... మోసాలు... ద్రోహాలూ... ఆత్మహత్యలూ... హత్యచేయు ఆత్మలూ... జీవించే మరణాలూ... మరణించే జీవితాలూ... పశు మోదాలూ... వివశఖేదాలూ... శిశు రోదనలూ... యేవేవో వాదనలూ... ప్రపంచమ్మొత్తం... గుత్తకు మల్లే... గుత్తికి మల్లే... ఒకే ఒక గుళుచ్ఛమై... పూగుత్తిలా దగ్గత్తికతో మాట్లాడ్తూ... మాట్లాడలేక... మాట్లాడలేని మాటల్ని... మాట్లాడాలని తపిస్తూ... ఆ గుళుచ్ఛం... అన్నీనూ... అందరూనూ... అట్లాగట్లే కలబోసుకునురేసుకుని మా 'మంజూష'న్పెప్పబడ్తూన్న పెట్టె తెర్చినప్పుడ్లోంచీ వాసనలూ వస్తువులేకాదు... వైయక్తిక 'నువ్వు'లు పారిపోండి... 'నేను'లు అనబడే మూడాశలు ఘనీభవించి... ఘనంగానే ఘనీభవించి... ద్రవీభూత రక్తాల్తో సహా ఘనీభవించి... తెరిచిన...

అనాదిలోంచే...

పెట్టె అనబడే 'మంజూష' అని మా మూడాశలూ పిలిచే 'కోల్డ్‌స్టోరేజ్' అను 'హిమికాపేష్టిక' లోపలి ద్వారాన్ని 'డీప్‌ఫ్రీజర్ డోర్' అనింగ్లిష్లో దొళ్లుతూ... తెరచి... అందులోకి దూకేసి... ప్రవహించడం మానేసి ఇంచుక మాత్రమైన ప్రవహించక... ఇంత మాత్ర మిదేనను వేదనగా ఘనీభవించి... యీ సదరు పురాతన మంజూషలో లోపల్కి దూకి... అలవోకగా అలాస్కాలో తేలుతాం... ఆర్కిటిక్ సముద్రమంత విస్కీలో లాగన్నమాట... లిక్విడ్నైట్రోజన్పైపుల్లో చిక్కుబడ్డ ఉక్కిరి బిక్కిరి పి.ఓ. డబ్లూ గాండ్ల 'నీలి కథలు' మా కవసరం లేదనిన్నూ... (దఖలు స్ఫటిక సదృశాలు, అసలు మా కథలు, ఐరన్‌కర్టెన్, మా నేపథ్యం ఎ(రటి గ్రీన్రూమూ మొ॥నవి) 'రతిసుఖ సారే గతమభి సారే' ఒక్కచరణం చాలు మాకు మౌతార్గన్లో వాయిస్తూ... 'మౌత్...' 'ఆర్గన్'... 'ఆర్గానిందమౌత్' 'మౌతాంద ఆర్గన్' కనిలింక్టస్ కచ్చేరీ... (అంబడిపూడి అంటున్నాడు (సాక్షుల్లో వీడూ ఓడు కొక్కోకం ఎల్లిస్ ఉల్లేఖిస్తే పోతన్నలాగ బమ్మెరపూడిలో నేను భగినీదండకం వ్రాయలేదని...) దీనికి సాక్షి మనస్సాక్షి లేని మదనాంగానిదే దాఖలా...అనిన్నూ)

**యింకా అనాదిలోంచే...**

కార్పణ్యం లేని కచేరీ జరుగుతోన్న వేదిక మీదకాదు కింద... ఆ వెనక 'ఆమాటీ



ఒకటి' 'బాక్'తో అంటున్నాడు... బాకూ! బాకూ! నే తీగపై రాస్తాను. నువ్వు తీగ మీద నొక్కుతావు... అంబడిపూడి అదేసరదా అంటున్నాడేమిటి అంటూంటే యేమీ వినపడని బెతొవెన్ చెవిలో సరిగమల డోరేమీలు పెట్టితుడుచుకుంటున్నాడు... ద్వారం క్యూబన్ షెరూట్ కాలుస్తూ... అనందభైరవ్ని వొదుల్తున్నాడు మేఘ మల్హార్ లాగా నన్నమాట.... (ఇవన్నియూ మృదాశ 'చావుకూటి' సందర్భ అసందర్భ ప్రేలాపన్లే అని గ్రహియింపగలరని మనవి) ఆ అసందర్భ సందర్భంలో చావుకూటి వాకిటి ముందు చప్పుడైతే చప్పట్లు కొట్టుకుంటూ వెంకటకృష్ణ శ్రీనివాస 'హో'కు విరసం నిరసన "ముద్దెండి పోతున్నయ్ కదుక్కుందాం రండ హో" రెండూ రెండు చేతుల్తో పట్టుకుని 'దిగంతం' వేపు వెళ్తూ కనిపించాడు... అప్పుడు మూడు ఆశల్లో ఒక్కడినైన నేనన్నాను.. శేషేన్ చరమ రాత్రి రాస్తే... I flow into myself లాంటి Statement కి

**అక్కడినుంచె...**

Attestation నాత్రాలు (My signature) అనే 'మో' ని అర్థం చేసుకోలేక భయపడి సెభాషనే గాళ్లే యెక్కువా" అని... వెంకటకృష్ణ వెనక్కితిరిగి

"విధువదనా! There are blue clouds surrounding you నీ శిశిరానికి చంద్రశేఖర్‌తో ముందేయించుకో పోనీ సమరంతో సలాహ్ చెప్పించుకో" అనుకుంటూ 'దిగంతం'లోకి వెళ్ళిపోయాడు...

శృంగాటకంలో పుస్తకాల్ని కంట్రోల్ చేస్తోన్న ఓ లేడీ ట్రాఫిక్ కనిస్టేబు చెప్పరాని చోట గోక్కోడానికి భయపడ్తోంది డైరెక్షన్ మారుతుందే 'మో'నని...

కాఫ్కాని కావలించుకున్నాతడు రంగమెళ్లొచ్చినా కవితకి రంకుమొగుడే... మా మైమోసాపూడికా... ముకలంబెకియాగాడు బ్రిష్టల్ పిస్టల్ గురిపెట్టి కాల్చుకు చచ్చిపోయాడు చెక్కలి చెమీలీ పూచిన చామంతిగాడు Bombyx mori అనే పట్టుపురుగ్గాడు వాడి కకూన్ కక్కుస్‌లోనే వాణ్ణివాడు కలలకు ఉరిపెట్టుకుని వేల్లాడ్తూ హత్య చేసుకున్నాడు... **తిరుగు... అనంతంలోకి జరుగు... అనాది నుంచీ అనంతమనే అంతంలోకి...**

అయ్యో జ్ఞాపకమా! యెంత జాలిలేని దానవు..

యెందులకిటు మము హింసింతువు?!... మాకునూ ఉషస్సులున్నవి... మాకునూ బంగరు సంధ్యలు గలవు... మాకునూ రేపుల యందు తేలియాడు వెచ్చని నిట్టూర్పులు గలవు దయాహీనజ్ఞాపకమా... మము వీడిపొమ్ము... మా దారులయందు నిలువునా పాతుకు పోదగదు నీకు... మా పాంథశాలల యందు నిద్రింపవలదు... పొమ్ము పొమ్ము మమ్మువీడి... అసురవాణీ మరణించి పొమ్ము... నీకివే తిలలు సలిలంబులు.. మేము అనబడే మూడు ఆశలు నీకు బాకి లేము గాక లేము.

ఇందుకు సాక్షులు: బిక్కలము : మూడు ఆశలు

1 : రేపు

2 : మరోరేపు



## The News Paper అనబడే నా నట్టింట్లో నాగరికత

రెండు కన్రెప్పల్ని చీల్చి
భూమ్యాకాశాలను చేసి
ఓ మహోదయాన్ని భ్రూమధ్యంలో ఆవిష్కరించుకుంటూ
మూడు రూకల పోరంబోకుమీద
పోడు సేద్యం... ఆజ్‌కీ తాజా ఖబర్...

కాలం కాలం కీ మధ్య
కాలం గీచిన కాలకరాళ రేఖోటి
అబార్షనైన వార్తల అపశ్రుతి...
మంత్రుల కంత్రీ చేష్టల సువార్తలు
అలాస్కాలో చేపలకి అనానిమస్ రుజినాలు
అండమాన్లో నారికేళ జలపుష్ప వ్యంజనాలు
రుచులు
అభిరుచులు
రుచిర విచిత్ర శోచిర్నివహపు మంత్రలోకాల పోకడ...
కల్ల బొల్లి జిల్లా పేజీల
అశుద్ధం నాకే
అక్‌బారీ తకరీరీ...

❊ ❊ ❊

స్వప్నారణ్యం మధ్య
మత్తుకూ విగత స్పృహకూ సంకేతాలు
మండూకరేణాలు శిలీంధ్ర ఆతపత్రాలు కలిసి
జీర్ణమద్యపు రసాయనాల రసయానాలు...
మండూక రేణాల మన్మథ సంకేతాల
సమాంతరతను చూట్టానికి



జీర్ణమద్యంలా ప్రేమ పద్యం తాగడం...
మూసుకున్న ఆల్చిప్ప
అపురుషంపశ్య...
పెదవుల మధ్య నలగని ఉలిపిరి కాయితం...
డాలీ మీసాలకు ఉయ్యాలలూగిన
నాల్గు హిప్నగాజిక్ మాంటాజ్‌లు
స్వప్నరాజిత చిత్రాలై...
మరుగుజ్జు ఆగదై
ఖయ్యాం చషకంలో నిండిన పద్యాల్లోపడి చచ్చిపోయాడు...
ఎమ్మెఫ్ హయమదనం చూసిన
సోమిదేవి వదనంలో సోమయాజి చిట్టెలుక
హరిత కుశాగ్రం మీద
చీలిపోయి చిట్లిపోకుండా నిల్చిన తుషార పృషతం
పారదర్శక కువలయగోళం
పూషునికి పోసిన స్వేదం
ఒక అనాహత మంత్రనాదం...

❋ ❋ ❋


నాలోకి ప్రవేశం నిషిద్ధమని
తోట కేకలు వేస్తోంది పరిమళిస్తూ
వస్తేమాత్రం... నువ్వు పువ్వై పోతావని
బెదిరిస్తూ...
మార్ఫింగ్ మార్మికత...
పువ్వులు కళ్లై
పాటలన్నీ పక్షులై...
'బృందావనంలో' అర్పణాకౌర్‌ని చూసి
'ఒకీఫ్''
పుర్రెలూ ఎడారులూ మధ్యకి
విసిరేసింది పూలని



'మోనే' తానే తామరతూడై
తనకి ఆడతనాన్ని పూయించుకుంటాడు...
'స్టోన్ హెంజ్'కి రాయి మోసిన చేయి
కైలాసనాథుని మోనోలిధికాలయాన్ని చెక్కిన
ఉలికి గిలిగిలిపెడుతోంది...
స్ఫింక్స్ గాండ్రించదు
మన బసవన్న రంకెయ్యడు
కానీ వాళ్లముందు క్యూగట్టి యాత్రించే మూర్ఖుల్ని నిజంగానే
లింగమార్పిడి చేసి కుబ్జుల్ని చేసి ఖొజ్జాల్ని చేస్తారు...
క్యారియాటిడ్లని పిల్చుకొచ్చి ఖజురహోలో
కాలం ఫిగర్స్‌ని చేసి
ఎఱ్ఱకాంతుల్లో ద్వారబంధాలకి బంధించేస్తే
ఆ భగినీ భగాలు అవుతున్నాయి
పాయిఖానా తూములు...
సంగ్‌మర్మర్ మహాసమాధి వెనక ప్రవహించే
వైతరిణిని
ద్వాపరంలో కిట్టయ్యకి చూపిస్తే
దోచేసిన గోపికల చీరల్తో ముక్కుమూసుకుంటాడు
ఛీః...ఛీః... మండూకరేణాల శిలీంధ్రాల
తోటలే బెటరంటాడు...

✳ ✳ ✳

సమాధి రాయి మీద
విమల ప్రేమ గీతం చెక్కి
ప్రియురాలికి రాయని ప్రేమలేఖని
పబ్లిక్ చేస్తాడు ఆవారా బేవార్స్ ప్రియుడు...
శవం మాట్లాడదు గదా!
ఉల్కా శకలాన్ని చూపి తెలీని విశ్వ రహస్యాలను
మాట్లాడే శాస్త్రవేత్తలాగా...



మాట్లాడే మౌనం శవం
విశ్వరహస్యం ప్రేమ...
అరోరా బొరియాలిస్
ఆరిపోని దీపశిఖ
ఆర్కిటిక్ జోన్ మనం వెలిగించని ప్రమిద
మంచు...
మౌనం...
విశ్వరహస్యాన్ని
చిట్లిపోయిన చిన్ని నక్షత్రం గానం చేస్తోంది
కాస్మిక్ మ్యూజిక్ మ్యాజిక్...
ధూమకేతువు
కామయాత్ర
చీకటి ఆకాశంలో
వసంతాల్ని
అల్లరిగా చల్లే పిల్లలల్లే
నక్షత్రాలు రౌడీ చుక్కలు...
ఆకాశమంతా
ఆరేసుకు పడుకున్న ఆడతనం...
బేషరం ఖూబ్‌సూరతీ...
రా... రమ్మని పిలిస్తే...
కాంతికి అప్పుడే
మెనార్కీ...
సుమరజస్సు... ఓజస్సు
విస్ఫోటనం... లావా...
మాగ్మా... పగిలిన ఫలించని ప్రథమాండం...
అఖిలాండం అజాండం...
బిగ్ బ్యాంగ్...
మరో పుట్టుక



విశ్వరహస్యం...
నానా స్వప్న వర్ణ సంవర్తంలో
పడి తన్నుకుంటున్న నాకు
యోగముద్ర వటపత్రశాయి
తంజావూరు స్పృహ
అద్దం మెరుగల్లే ముద్దు ముద్దుగా

❊ ❊ ❊

అభ్యుదయం
శాస్త్రం
సాంకేతికత
నాగరికత
నాల్గుదారులు
శృంగాటకంలో దిగంబర సచ్చీలత
అశ్లీలంగా
మంత్రనగరాలకి సైన్‌పోస్టు...
ఇక్కడ
పుళ్లు పూవులు పూస్తాయి
బొమ్మజెముళ్లలాగా...
అక్కడ
మదనాంగాలు నోట్ల తొట్లలో
తూకమేసి అమ్ముతారు కమ్మ కమ్మగా
ఆవూరు పేరు పేరునా చెప్పఖ్ఖర్లేదు
అది కామాటిపురానే కానఖ్ఖర్లేదు
మరోచోట
లింగాలు విస్ఫులింగాలు చిమ్ముతాయి...
వియరాల్ కాస్మోపోలిటన్స్...
పంకం కుంకం
దరిద్రం హరిద్రం



నిత్య సుమంగళి
తాళిలేని వూరాలి...
నాగరికత అదృశ్యంగా
న్యాయం త్రాసు ముల్లుకు వేల్లాడ్తో
'లా' కంట్రోలింగ్ చేస్తోంది...
మూర్ఖుడు నిజంగానే కాలం ముళ్లనాపగల్డు
సినారే హరాకిరీ చేసుకున్నాసరే...
గాంధీబొమ్మ కాయితానికి
మద్య మోడమ్మితే
మద్యం కోసం పద్యాన్నే అమ్మేస్తాననింకోడు...
ఉద్యమం ఆకులో ఉచ్చపోసేవాడింకోడు
క్యా తఅజ్జుబ్!
శ్వేతశ్మశ్రువు ట్రేడ్మార్కు మాధురీ పిచ్చోడు
నుమాయిషీలో సరస్వతిని
దిక్కులేకుండా దిగంబరం చేసాట్ట
కాల్చండి... నరకండి... చంపండి...
మరి సారస్వతాన్ని
గ్యాంగ్ రేప్ చేస్తున్న
దొంగలంజాకొడుకుల్నేం చేయాలో...
యెంత కళాత్మకం
మతం..!
తస్లీమా ముస్లీమా?
ఆడతనమే ఓ మహామతంరా మంద బుద్ధుల్లారా!
కోదండం నిక్కదీసి
నారిని సారించి కొడితే
నిలువునా చీరుకుపోయింది
మానవత్వమే మహానుభావుల్లారా!
కోరిక 'టోర్టియ' పై పరిచిన మాంసపు కూరై



చుట్ట చుట్టబడి కొరకబడిన
'ఎన్నలాడ' తనమొరేయ్...!
పేజీ తిప్పు తాజా...
❊ ❊ ❊
కాంతి పీలికల్ని పేని పేని హంటర్లని చేసి
కాయ లోపలి కాంతివంతపు వెన్నెల్నంతా కొరికేసిన
పురుగుల్నదిలిస్తున్నాడు వాడు
బేళ్ల బేళ్ల కలల కప్పాస్
షండ యోజనాల
ముండ ప్రభుత్వాల గఫాస్
కల్తీ లేనితనం ఓ బక్వాస్
ఇప్పుడు చూడండి
ఈ క్రిమిసంహారిణి తాగి
ఓట్లైన పురుగులన్నీ చచ్చి చేలగట్ల మీదున్నై
ఒక పురుగుకి పంట పరిహారమట
గుండెకాయ తొల్చబడి పంటచేలో
పడి చచ్చిన వాడి తస్వీర్
సర్కార్ మెళ్లో మణిహారమట
ఇటు పిమ్మట
విత్తనంలోంచీ మొలకెత్తే ప్రతి పిడికిలి చేత సమ్మెట...
ఇక
విత్తనాలు విస్ఫోటించకేం చేస్తాయి...
బీజంలోంచీ అవ్వాజ విప్లవ జ్వాలలు తలలెత్తుతై
హాఁ...
నా వేలిచివర్ల చిట్లిపోయిన రాగాలు
తీగలమీద
విషాద వసంతాలరోగాలైనాయి
ఇదేం వార్తల పత్రిక?



హరితమంతా హరించుకుపోయి
మండూకరేణాలూ శిలీంధ్ర ఆతపత్రాలూ
నాచుల రోజుల్లోకి పాకే రోజొచ్చేసింది...
ఈ మాటు కాస్మిక్ ఎక్స్‌ప్లోషన్ కాదు
జరిగేది ఇంప్లోషన్...
కుంచించుకు కుంచించుకు
బిగ్ బ్యాంగ్
అజాండం
అఖిలాండం
ఫలించని ప్రథమాండం.


❊ ❊ ❊



# నా చేదు

ఉభయసంధ్యల మహాద్భుతాన్ని ధరించిన
కావడిలా మోసేవాడిని కవిత్వాన్ని
ఓపిక నశించింది
ఆయాసమొస్తోంది... ఆక్రోశమొస్తోంది
ఇక జేబులోంచీ పొడి జలతారు మాటల్ని
చల్లుకుంటూ వెళ్లడమే నే చేయగల్గింది...
ఏవేవో రహస్య రసస్పందనల శకలాలని
రోడ్డు మీదకి నిర్భయంగా వెదజల్లగలవాడినే
పొడి జలతారులాగా...
రోడ్డునద్దం చేసి
నా నడకను నగ్నంగా వీధుల మీదారేస్తా నేనే...
నాపరాతిమీద మెత్తటి నీటినీడల్లో
అమాయకపు ఆకాశపుతునకల్ని అవనతమై చూస్తూ
అనంతాకాశాల్నే భుజాన మోసేస్తాననుకుంటా నేనే...
సోమరి సాయంత్రపు గాలి
ఆకుల చీకట్లలో ఒదిగి పడుకుంటాననంటే
రజనీ గంధాల అందాలను మోసుకురమ్మని
దాన్నదిలిస్తా... నేనే...
బిరడా గొంతుకురేసిన సితారుతీగ
మృత్యుగీతి నాలపిస్తుంది...
బ్రతుకు పుస్తకం బోర్లాపడి జీవితం ఒలికిపోతోంది
ఒంటరి కొవ్వొత్తి కోటి కిరణాల యుద్ధం చేస్తోంది తిమిర మరణాలతో
పరమళించే అరణ్యాల సుందర అంధకారంనించీ
సత్తు నగిషీల విషజ్వరావృతాల కల్తీ రాద్ధాంతాల
'శ్వేతాంధకారం'లోకి నేన్నడవనంటే నడవను

(కీ.శే. ప్రొ. బి.ఆర్.గోపాల్, మైసూర్ గార్కి కృతజ్ఞతలతో)



# నడిరేయి ఆ అడవిలో నీవూ నేనూ

నిశి నడుమన నను లేపి
వసంత పాడమన్నావు నీవు
నిజం చెప్పు...
ఆ రాతిరి గురుతుందా?
నే స్వరించిన రాగం కాదు...
నీ ద్రవించిన స్వాంతం కాదు
నిజం చెప్పు
చీకటిని కప్పుకుని మనం
మాట్లాడే చెట్లతో మౌనం ఆలపించలేదా?
మన బరువు మోసిన
చిగురుల నడుగు
నువ్వేసిన ప్రతి అడుగూ...
నిజం
ఒక్కో చిగురూ మోసిన వసంతం
ప్రతి పల్లవం మీదా
వెల్లువై నువ్వు ఉద్భవిస్తూ రాలేదా?
ఆ అరణ్యం ఆనందాన్ని
ఆవిష్కరించలేదా?
నీ చరణాల మరణం
చిగురించలేదా?
నిశాంతాన ఓ ... రాగం
నిన్నూ నన్నూ
ప్రశాంతంగా విడదీయలేదా?
కిరణంగా నిన్నూ!
మరణంగా నన్నూ!



# రోగి

పరిమళించే
మరణాల మధ్య
రవళించే ప్రాణాల వింటూ
చివ్వున స్రవించే
పువ్వుల హృదయ రుధిరస్రవంతుల కంటూ
ఇంకొక్క పాటకై
మరొక్క మాటకై
బ్రతుకంతా ఎక్కుపెట్టి
కట్టు కట్టూ
ఓ కనికట్టు
ఆ యవనిక మాటున
కుట్టిన కుట్ల కుతంత్రపు వికృతిలో
శాస్త్రం చిర్నగవు
మన్మోహనాస్త్రమై
తెల్లటి కోట్లలో నిన్ను ఉదయాన్నే పలకరిస్తే
మళ్ళీ మామూలుగా...
మరణానికి కొన్ని
క్షణాల దూరంగా
నువ్వు–
మనిషి రహస్య జీవన శాసనాలు రాసే
మృత్యుగ్రంధాల
ప్రతి పేజీలో
ఆశావాక్యపు అంత్యబిందువై
ఆ గదిలో నీవు
అనంత విశ్వమై...



# ఆ 'ఒక్క' క్షణాన

తమోకిరణం తలపు తడితే
తనువంతా వాకిళ్ళే
అంతశ్చేతనా భావనా వాక్యం
కావ్యమైతే–
అనుభూతి అంతా అక్షర భావ్యం.
శక్రధనువులు నా గది గోడల
చిత్రమాలికలై చిగురిస్తే
నే పల్లవించిన ప్రసవం.
ఎడారితుఫానులు ఘనీభవించిన
ఓ ఇసుక తుఫాను పాట
మాటి మాటికీ నా మనసుగది కిటికీ రెక్కై
తటతటలాడు స్వప్నం.
ఉద్విగ్న వివశత
మనోజ్ఞ పాశవికత
ఘనీభవించిన ప్రళయం.



# ప్రసవం

నా ఏకాంత స్వప్నం
విశృంఖల విహంగం...
శ్వేత పంఖాలు వికసించగా
ఆకాశ మానసం విస్తరిస్తూ
దిక్కులు రంగమై నర్తిస్తూ
పురులు విప్పి...
నా స్వగత రతిలో
స్ఖలించిన
నిర్వీర్య వీర్యబిందువు
పరివర్తించిన... నర్తనలో
చిక్కటి చీకటి దారులు
నెత్తుటి కన్నీటి ధారలు
సంవర్తంలో
ప్రభవానికి
ఓ చిటికెడు దూరంలో
నా కల
ఓ అల.



# అంతర్వేది నా దేహ శకలం

దేహపు సరిహద్దులు కొలుచుకునేందుకు కొంచెమీ కోరికా...
ఒక్కోమాటే కోరికా కోరక
విస్తరిస్తూ వెళ్ళిపోతున్న యీ దైహిక ప్రపంచపు అంచులు
కసిగా విసిరే నైతిక కొక్కేలకు దొరకక...
అద్భుత సౌందర్యాల హత్యలు జరిగే వనసీమ
మహాద్భుత హత్యల సౌందర్యాల... మళ్ళీ అంతే
అటెందుకూ?!
కొద్దిగా దగ్గరగా... మరికొద్ది దగ్గర దూరంగా
దూరం దగ్గరగా దగ్గర దూరాల తీరాల వేపు
మళ్ళీ అటెందుకూ?!
దో బూంద్ నషా...
ఖాలీ ప్యాలా...
నిస్తబ్ద దేహశకలం... అజాగ్రత్తగా...
మసక పొగల మార్మిక నీహార స్పష్టాస్పష్టపు నీడల జాడల...
కినికినిగ్... ర్యాపిటప్... కాలేదని కాదుగానీ
రతిరహస్యం ... దో బూంద్ నషా...
హత్య చేయబడ్డ మల్లెల పరిమళం...
నిర్మల స్నిగ్ధసిత ఫాల ఫలకాన పొటమరించిన
స్వేదబిందు ద్వయ కర్పూర పరిమళం...
రెండు చుక్కల మత్తు
విస్తరించిపోయిన దేహపు సరిహద్దుల్లో రెండుద్వేగాల...
రెండూపిరుల రెండలపుల జెండాలు...
విరబూసిన కురవకమై
వొళ్ళంతా అరుణ మధురిమ పరచుకున్న క్షణాన



నా దేహపు సరిహద్దులు కొలుచుకునేందుకింకే
          కోరికా కోరక...
కౌముదీ, మిహికా పవన కెరటపు ఛురికా చీల్చేసిన
అయిదు పాయల అస్తిత్వం,
          అమర సాగరాన్ని అదుముకున్నప్పుడు
అయిదు చీలికల కోరికల...
మధ్య ఒకే అంతర్వేదిగా
నా దేహ శకలం...



# అశీర్షిక -1


అలవోకగా అరణ్యపు
ఆకుపచ్చని చీకటి ఏకాంతాన్ని
భ్రమసిన నాకు...
తెలిసింది
ఆ విచిత్ర శబ్దాంతర్గత నిశ్శబ్దంలో
వేల నాలుకలతో
వేవేల రాగాలు
జీవచైతన్యాన్ని ప్రవచిస్తాయని

❊ ❊ ❊

పచ్చవెన్నెల పుచ్చపువ్వా...
వెచ్చవెచ్చగా విచ్చుకోగా
రెచ్చిపోయిన రెల్లుపువ్వు
గుచ్చి చూడగా...

❊ ❊ ❊

నిశ్శబ్ద ప్రవచనంలో
ప్రతిపేజీ పెనుతుఫానులాంటిది
శబ్దించను నేనెంత...?
నా స్వాంతర్గతానుభూత స్వప్నమా!
వెన్నెలై
వేయి తునకలై
ఈ ఆకుపచ్చటి చీకట్లలో
వేకువ జర తెలియని
నిషద్వరయై...
నాతో రమించు...



# అశీర్షిక -2

ప్రదోష గర్భ విచ్ఛిత్తి మృతభ్రూణాకృతిలో ధ్వాంతం
సంధ్యాగర్భం పోయి ధ్వాంతావిర్భావం...
ఆహిర్ భైరవ్ ఆలాపన లోంచి ఆవేదన
పార్కు చివర ఆకలిమార్కు ముఖాలు
చినిగిన టైర్ల మంట వెలుగుల్లో చలికాగుతున్న ఆనందావేదన
'పో'ను రమ్మన్న 'బాదిలేర్'
బాధలు మాత్రం తెల్సినవాళ్ళం
లేదా ఏదో ఒక
కవీంద్రుని కవితామహేంద్రజాలంలో... చిక్కుకున్న వాళ్ళం.
మీ జీవితాలు మమ్మల్ని క్షమించవు మేము చేయని నేరానికి,
మా మనోనేత్రాన్ని పెకలించి మీ మధ్యకు విసిరేసారు
ఆనంద సౌందర్య దృశ్యాల విందులో
ఉప్పటి మీ కన్నీళ్ళు చప్పరిస్తూ... వుండమని...
ఏమిటి మేం చేసిన నేరం...
　　　　మేం కవితాగానాలు చేస్తాం...
　　　　మీరు కన్నీటి స్నానాలు చేస్తారు...
పోయిన ప్రపంచ యుద్ధంలో
ఖైదీ బాధలకు మేమెంత బాధ్యులం.



# అశీర్షిక -3

మరణం తెర వెనుక
పుట్టుక ఒక నెత్తుటి మరక.
ప్రభాతాన్ని ప్రసవించేందుకు
నిశీధికి...
ప్రభుత్వాలను ప్రసవించేందుకు
ప్రజకు...
ఎంత యాతన?

❋ ❋ ❋

మరణం జీవనగీతి తుది
చరణం కాదు
సంధించిన విల్లునుంచి జారిన బాణంలాంటిది
పుట్టుక మొదటిమెట్టు కాదు
ప్రసవించిన పసికూనతో
వివశయై తల్లి వదిలిన తుది
బాధామయ నిశ్వాస,
తర్వాత యెంత ఆనందం

❋ ❋ ❋

ఎవరు నువ్వు?
ఎవరు వాడు?
ఎవరు ఆమె?
అటు ఎవరు? ఇటు ఎవరు?
అటు ఇటుకాక ఇటు అటు అయితే
తలక్రిందుల సత్యానికి
క్రిందమీదల మిథ్య.



# అశీర్షిక -4

చిగురుల పేజీల వసంతపు పుస్తకంపై
కర్కశంగా శిశిరపు లైబ్రరీ స్టాంపు వేసే కాలమా!
నీవున్నావని గుర్తుగా
ప్రతిపేజీకీ అక్కడక్కడా అస్పష్టతను అంగీకరిస్తా.
పైకి ముద్రలేమున్నా
అంతరార్థం?

# నీటిచెయ్యి లోపలి కాగితప్పడవ

ప్రతివాడి తలమీదా ఓ డ్రైనేజీ మూత. మూతల్ని జాగ్రత్తగా బిగించి పెట్టుకోవడం మనకు చిన్నప్పణ్ణించే సమాజం అలవాటు చేసేస్తుంది. లోపల ఎంత ఛండాలంగా వుండనీ అది బయటకు మాత్రం కనిపించరాదు. కనిపించిందంటే ఈ సంఘపునాదులు కదిలిపోతాయి. మానవ సంబంధాలు ఛిద్రమైపోతాయి. ఏమున్నా నువ్వు లోపలే అట్టి పెట్టుకో బయటికి మాత్రం సమాజం ఎట్లా కోరుకుంటోందో అట్లా కనిపించు. ఎంత జాగ్రత్తగా మూతల్ని కాపాడుకుంటే అంత ఉత్తముడు, పూజ్యుడు ఈ లోకంలో. అయితే ఇది అందరికీ సానుకూలంగా వుండదు. కొందరికి లోపల వాసన కూడా స్పష్టంగా తెలిసి జీవితం దుర్భరంగా తయారవుతుంది.

అలాంటప్పుడే ఇదిగో ఈ వేణులాంటి వాళ్ళు లోపలిదానికి బైటిదానికి వున్న వైరుధ్యాలతో విసిగిపోయి మూతల్ని విసిరి పారేసి ఎదురుపడతారు. జీవితమంతా మోసి మోసి విసుగుతో... అసహ్యంతో... వొళ్ళుమండి మూతల్ని చీల్చి చెండాడాలనే నిర్ణయానికి వొస్తారు.

వీళ్ళు చాలా ప్రమాదకారులు!

అనుక్షణము మన లోపలి దుర్గంధాన్ని స్ఫురణకు తెస్తారు. మనశ్శాంతి లేకుండా చేస్తారు. మనమేదో మర్యాదగా మన మానాన మనం బతుకుతూ కళ్ళు మూసుకుని హాయిగా నడుస్తూ పోతుంటే ముళ్ళలాగా కాళ్ళకు ఎదురొస్తారు.

నీళ్ళ చేతుల్తో వస్తారు కొయ్య చేతుల మధ్యకి. మానవబాంబుల్లాగా... అగ్ని పర్వతాల్లాగా గుంపుల్లోకి చొచ్చుకొస్తారు. వీళ్ళు తమ కవిత్వాల్నే కాదు తమని కూడా తగలబెట్టుకోడానికి సంసిద్ధులు. వేణు మాటల్లోనే చెప్పాలంటే అతడు చర్మాన్ని తిప్పి తొడుక్కున్న మనిషి.

మనమేమో శాంతికాముకులం. తల్లోంచి ఒక చుక్క వాసన రాకుండా, వొక్క పురుగు బయటికి తొంగి చూడకుండా బతికే మర్యాదస్తులం. ఓజోను పొరని

చించి చీరల్లా కట్టుకుని తిరుగుతాం. అడవుల్ని చొక్కా గుండీలకు అలంకరించుకుంటాం. కొండల్ని పెకలించి లివింగ్‌రూంలో వుంచుకుంటాం. సముద్రాల్ని ఫ్రిజ్‌లో దాచుకుంటాం. ఒక్క అహంకారపు ఆలోచనను తృప్తి పరుచుకోడం కోసం ఈ భూగోళాన్ని వందసార్లు దుమ్ము దుమ్ము చేయగల శక్తిపరులం.

అయితే వేణులాటి వాళ్లు మన మర పిడికిల్ని చీమల్లా కరుస్తారు. యుగయుగాలుగా దాచి పెట్టుకున్న మన సంపదలకు కన్నాలు వేస్తారు.

ఆకాశానికీ నేలకీ మెరుపుల నిచ్చెనల్ని వేస్తారు.

వీళ్ళు కాగితప్పడవలై మన యుద్ధనౌకల్ని ఢీకొంటారు.

కానీ మన సంగతి తెలీదు. సోక్రటీస్‌కు విషాన్ని, గెలీలియోకు గుడ్డితనాన్ని అవలీలగా అందించిన వాళ్ళం మనం.

అయినా మనతో ఓడిపోయి వాడిపోయిన ఈ కాగితప్పడవని చేతుల్లోకి ఓసారి తీసుకుందాం. నచ్చకపోతే ఉండచేసి అవతల పారేద్దాం. అవసరమనిపిస్తే వేణులాంటి వాళ్ళ కళ్ళు పీకెయ్యడానికి మన దగ్గర ప్రొక్లెయినర్స్, వేళ్ళు నరికెయ్యడానికి రాక్షస గిల్లెటిన్స్ ఎటూ వున్నాయి.

రమణ జీవి, హైదరాబాద్,20-0-02

Oka bahumukham ● Kasibhatla Venugopal

జ్ఞానం మనిషిని కలుషితం చేసిన మరుక్షణం వాడు చితికిన పాదరస బిందువు... ఎన్నిసార్లు ఒక్కటిగా చేసినా వాణ్ణి వాడు జారవిడ్చుకుంటూ శతసహస్రాలుగా చిట్లిపోతూంటాడు...ఆ శకలాల వికటపాలోచన్లే ఇవి. ఓ అంతర్దుఃఖం... ఆనందావేదనా... నిస్సహాయత... ప్రేమా, క్రోధం, పొగరూ అన్ని ముఖాల నేనూ - ఈ చిన్ని పుస్తకం...